సాక్షి
చిత్తూరు
శుక్రవారం । 21 । జూన్ । 2024



రిజర్వు ఫారెస్టులో వెదుర్ల వేట

పుంగనూరు ఫారెస్ట్ రేంజ్‌లో అక్రమ వెదుర్ల వ్యాపారం యథేచ్ఛగా సాగుతోంది. అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తోంది. - 8లో



ప్రతి విద్యార్థికి పాఠ్య పుస్తకాలు

ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్య పుస్తకాలు ప్రతి విద్యార్థికి అందాలని డీవైఈఓ చంద్రశేఖర్ తెలిపారు. - 8లో



కలుషిత ఆహారంతో అస్వస్థత

పాలసముద్రంలో కలుషిత మాంసాహారం తిన్న వందమందికి పైగా అస్వస్థతకు గురైయ్యారు. - 8లో

న్యూస్‌రీల్

మెరుగైన సేవలు అందాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ మణికంఠ

యాదమరి(పూతలపట్టు): ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. గురువారం యాదమరి పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. కేసుల వివరాలు, పెండింగ్ కేసుల వివరాలపై ఆరా తీశారు. స్టేషన్ స్వచ్ఛతను పరిశీలించారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని సూచించారు. శాంతిభద్రతలను పర్యవేక్షణలో నిర్లక్ష్యం ఉండకూడదని తెలిపారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పచ్చదనం పెంపొందించుకోవాలన్నారు. ఎన్నికల అనంతరం జరుగుతున్న దాడులపై తక్షణం స్పందించాలని తెలిపారు. సంఘ విద్రోహ శక్తులపై ఉక్కుపాదం మోపాలన్నారు. రాత్రి వేళల్లో సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. స్టేషన్ పనితీరుపై ఎస్పీ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ రవిశంకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు చిత్తూరులో యోగా దినోత్సవం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ యోగాతో శారీరక, మానసిక, ఆధ్యాత్మిక, ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చన్నారు. యోగాను ప్రోత్సహించేందుకు ఏటా జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కళాశాల మైదానంలో ఉదయం 7 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. జిల్లా అధికారులు, యోగా మాస్టర్లు, అభ్యాసకులు పాల్గొననున్నారని కలెక్టర్ షణ్మోహన్ పేర్కొన్నారు.

25,26 తేదీల్లో చంద్రబాబు పర్యటన

కుప్పం: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈనెల 25,26 తేదీల్లో కుప్పం నియోజకవర్గంలో పర్యటించనున్నారని టీడీపీ వర్గాలు గురువారం తెలిపాయి. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం మెదటిసారిగా నియోజకవర్గానికి రానున్నట్లు పేర్కొన్నాయి. రెండు రోజుల పాటు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించాయి.

ఎయిడెడ్ పోస్టులకు గ్రీన్‌సిగ్నల్

చిత్తూరు కలెక్టరేట్ : ఎయిడెడ్ పాఠశాలల్లో పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇస్తూ రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ సురేశ్ కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. గురువారం జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి ఈ ఉత్తర్వులు అందాయి. జిల్లాలో ఎయిడెడ్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను నియమ, నిబంధనల ప్రకారం భర్తీ చేయాలని, కసరత్తులో ఏ మాత్రం అలసత్వం ఉండకూడదని పేర్కొన్నారు. ఆర్జేడీ కసరత్తును పర్యవేక్షిస్తారని ఆ ఉత్తర్వుల్లో కమిషనర్ సురేశ్ కుమార్ సూచించారు.

ఆశలు కూల్చి.. కన్నీళ్లు మిగిల్చి!

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో టీడీపీ నాయకులు చెలరేగిపోతున్నారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై భౌతికదాడులకు తెగబడుతున్నారు. ఇదిచాలదన్నట్టు ఎన్నో ఆశలతో పైసాపైసా కూడబెట్టి నిర్మించుకున్న పేదల ఇళ్లను నేలమట్టం చేస్తున్నారు. అడ్డొచ్చిన వారిపై పిడిగుద్దులు కురిపిస్తున్నారు. ఆక్రమణల పేరుతో దొంగనాటకమాడుతున్నారు. అధికార యంత్రాంగాన్ని అడ్డుపెట్టుకుని పేదలకు కన్నీళ్లే మిగుల్చుతున్నారు. తాజాగా గురువారం రేణిగుంటలో పేదలు నిర్మించుకున్న 65 రేకుల ఇళ్లను ధ్వంసం చేశారు. దీనిపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది.



రేణిగుంటలో జేసీబీల సాయంతో పేదల ఇళ్లు కూల్చివేస్తున్న అధికారులు

- జిల్లాలో కొనసాగుతున్న పచ్చ దండు విధ్వంసం
- వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులే లక్ష్యం
- పేదల ఇళ్ల కూల్చివేతపై సర్వత్రా విస్మయం
- పట్టనట్టు వ్యవహరిస్తున్న అధికార యంత్రాంగం
- రేణిగుంటలో పేదల రేకుల ఇళ్లు నేలమట్టం

సాక్షి టాస్క్‌ఫోర్స్: గత ప్రభుత్వంలో నిరుపేదల జీవితాల్లో కొండంత భరోసా నింపి వారి మీద ఈగ వాలనివ్వకుండా కాపాడుకుంటూ వచ్చారు. అయితే టీడీపీ అధికారంలోకి వచ్చాక, ఆ పార్టీ నాయకుల ఆగడాలకు హడలిపోతున్నారు. టీడీపీ శ్రేణులు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులే లక్ష్యంగా ఓ వైపు భౌతిక దాడులకు దిగడమే కాకుండా వారి ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. పట్టించుకోవాల్సిన అధికార యంత్రాంగం దగ్గరుండి దాడులను, కూల్చివేతల పర్వానికి పచ్చ జెండా ఊపుతున్నారు. ఆటవిక సామ్రాజ్యంలో అభాగ్యులు సమిధులవుతున్నారు. ప్రజలు అధికారమిచ్చింది ప్రతీకార దాడుల కోసమే అన్నట్లుగా రెచ్చిపోతున్నారు. తాజాగా గురువారం రేణిగుంటలో పేద దళితవర్గాలకు చెందిన సుమారు 65 రేకుల ఇళ్లను అక్రమ నిర్మాణాల సాకుతో అధికారులు నేలమట్టం చేసి తీరని నష్టాన్ని మిగిల్చారు.

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పేదల ఇళ్లు కూల్చడమే లక్ష్యం

చిత్తూరు జిల్లా వ్యాప్తంగా టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల ఇళ్లపై దాడులు చేసి ఆస్తులను ధ్వంసం చేస్తుంటే, శ్రీకాళహస్తి నియోజకవర్గంలో మాత్రం అందుకు భిన్నంగా పేదల ఇళ్లను కూల్చివేస్తున్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని రాజీవ్‌నగర్‌లో ఇళ్లను కూల్చివేసి సుమారు రూ.5 కోట్ల మేర పేదల ఆస్తులకు నష్టం కలిగించారు. తాజాగా రేణిగుంటలోనూ గురువారం ఉదయం దళిత నాయకులు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులను హౌస్ అరెస్ట్ చేసి సీబీఐడీ కాలనీ సమీపంలో నిర్మించిన 25 ఇళ్లను కూల్చివేశారు. సుమారు 100 మంది పోలీసు, కేంద్ర బలగాలను మోహరింపజేసి బాధితులెవ్వరూ రాకుండా అడ్డుకున్నారు. అక్కడి నుంచి రేణిగుంట వివేకానంద కాలనీ సమీపంలో నిర్మించిన 40 ఇళ్లను కూల్చివేశారు. దీంతో కోట్ల రూపాయల మేరకు ఆస్తి నష్టం వాటిల్లింది. బాధితులు లబోదిబోమంటూ ఆర్తనాదాలు చేసినా అధికారులు కరుణించలేదు.



దగ్గరుండి పేదల ఇళ్లు కూల్చివేస్తున్న అధికారులు



జేసీబీతో విధ్వంస కాండ

రేణిగుంట తహసీల్దార్‌ను నిలదీసిన మహిళలు

రేణిగుంట వివేకానంద కాలనీలో సుమారు 40 ఇళ్లను కూల్చివేశారు. దీంతో ఇళ్లు నిర్మించుకున్న పేద దళిత మహిళలు అక్కడకు చేరుకుని అడ్డుకునే ప్రయత్నం చేసినా వారిని పోలీసు బలగాలు దగ్గరకు రాకుండా కట్టడి చేశారు. తర్వాత తహసీల్దార్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఇళ్లన్నీ నేలమట్టం చేశారు. నిర్మాణాల తొలగింపు పూర్తయ్యాక, అక్కడి నుంచి బయల్దేరుతున్న తహసీల్దార్‌ను బాధిత మహిళలు అడ్డుకున్నారు. 'గతంలో తాము ఇళ్లు నిర్మించుకుంటున్నప్పుడు ఎందుకు అడ్డుకోలేదు.. ఎందుకు చోద్యం చూశారు.. ఇప్పుడెందుకు వచ్చి కూలగొట్టి మా బతుకులను వీధినపడేస్తున్నారు.. అప్పులు చేసి రేకుల ఇళ్లు నిర్మించుకుంటే ఏమిటీ దౌర్జన్యం' అంటూ నిలదీశారు. శాపనార్థాలు పెట్టారు. అయితే అధికారులు అక్రమ కట్టడాల సాకుతో కూల్చివేసిన ఈ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి బాధితులకు అనుభవ ధ్రువీకరణ పత్రాలు, ఎన్‌వోసీ, ఇంటి పన్నులను రెవెన్యూ, పంచాయతీ అధికారులు ఎలా ఇచ్చారని బాధితులు ప్రశ్నిస్తున్నారు.



ఎవ్వరినీ రానివ్వకుండా పోలీసుల మోహరింపు



పేదల ఆశల సౌధం నేలమట్టం



భారీగా మోహరించిన పోలీసులు

ఉమ్మడి జిల్లాలో ప్రతీకార దాడులు

- చిత్తూరు జిల్లా పరిధిలోని చిత్తూరు నగరానికి చెందిన హరి అనే వైఎస్సార్ సీపీ కార్యకర్తపై దాడి చేసి అతని సిగరెట్ గోడౌన్ కాల్చివేశారు. ఈ దాడుల్లో రూ.60లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది.
- చిత్తూరు నగరానికి చెందిన రెండు చికెన్ బిర్యానీ దుకాణాలను ధ్వంసం చేసి రూ.10 లక్షలు నష్టపరిచారు.
- ఎస్‌ఆర్ పురంలో వైఎస్సార్ సీపీ ప్రచార రథాన్ని ధ్వంసం చేసి రూ.12 లక్షల వరకు నష్టపరిచారు. చిత్తూరులో కన్నన్ అనే వ్యక్తి బేకరీపై దాడి చేసి రూ.2లక్షలు నష్టం కలిగించారు.
- జీడీ నెల్లూరులో గౌతమి, గిరి, మోహన్, మురళి, కర్ణ ఇళ్లు ధ్వంసం చేశారు. ఈ విధ్వంసంలో రూ.5లక్షల వరకు ఆస్తి నష్టం కలిగింది.
- పూతలపట్టులో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు బాబు, జయపాల్, నిరంజన్, కిరణ్, భారతి, లోకేష్‌పై దాడులు చేసి వారి ఇళ్లు, ఆటోలను ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో రూ.7 లక్షలు నష్టం వాటిల్లింది.
- యాదమరిలో బాబు, అలీ, అఫ్జల్, గుల్‌వీర్, ఉస్మాన్, మున్నీ, కబీర్, జాకీర్, సలీమ్, గౌస్‌బాషకు చెందిన లారీ, దుకాణం, బైక్, ఐదు ఇళ్లను ధ్వంసం చేశారు.

విద్యార్థుల జీవితాలతో కేంద్రం చెలగాటం



ధర్నాలో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నేత శివారెడ్డి

- 'నీట్' లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలి
- ఏఐఎస్ఎఫ్ నాయకుల ధర్నా

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థుల జీవితాలతో కేంద్రం చెలగాట మాడుతోందని, నీట్, యూజీసీ, నెట్ పేపర్ల లీకేజీలపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని ఏఐఎస్ఎఫ్ (అఖిల భారత విద్యార్థి సమాఖ్య) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆ సంఘ నాయకులు జిల్లా కేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) విడుదల చేసిన నీట్ ఫలితాలలో 720కి 720 మార్కులు 67మందికి రావడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఆ విద్యార్థులు హర్యానాలోని ఒకే సెంటర్‌కు సంబంధించిన వారున్నట్లు తెలిపారు. బీహార్‌కు చెందిన ముఠా ఒక్కొక్క విద్యార్థి నుంచి రూ.30 లక్షలు వసూలు చేసి దొరికి పోయినట్లు తెలిపారు. అయినప్పటికీ వారిని ఇంత వరకు అరెస్టు చేయకపోవడం దుర్మార్గమని విమర్శించారు. తక్షణమే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన ఫలితాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. సమగ్ర విచారణ చేసి మెడికల్ విద్యార్థులకు తగిన న్యాయం చేయాలన్నారు. రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే నీట్ పరీక్షను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆ పరీక్ష రద్దుకు దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు కోరుతున్నప్పటికీ కేంద్రం ఏ మాత్రం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. యూజీసీ నెట్ పేపర్ లీకేజీ కావడంతో కేంద్ర విద్యాశాఖ అధికారులు రద్దు చేశారని, నీట్ పేపర్ ను ఎందుకు రద్దు చేయడం లేదో తల్లిదండ్రులకు కేంద్రం సమాధానమివ్వాలన్నారు. విద్యార్థులకు న్యాయం జరగకపోతే కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కన్వీనర్ ప్రవీణ్, జిల్లా నాయకులు షేక్ బాబు, ఆదిల్, చరణ్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

కల్పవృక్షంపై కమలాకాంతుడు



కల్పవృక్షంపై రాజమన్నార్‌గా శ్రీవారి దర్శనం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పుత్తూరు: అప్పలాయగుంటలో టీటీడీ అనుబంధ ప్రసిద్ధ శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో నాల్గవ రోజు గురువారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీనివాసుడు శ్రీరాజమన్నార్ అలంకరణలో కల్పవృక్షంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, కొలువు, అర్చన, మొదటి గంట తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు. 8 గంటలకు పట్టుపీతాంబరాలు, పరిమళభరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో శ్రీదేవి, భూదేవి సమేతంగా స్వామివారు కల్పవృక్ష వాహనంపై తిరువీధుల్లో విహరించారు. 10 గంటలకు స్నపన తిరుమంజనం వేదోక్తంగా నిర్వహించారు.

కల్యాణం..కమనీయం

సాయంత్రం 4 గంటలకు కల్యాణోత్సవం ప్రారంభమైంది. శ్రీదేవి,భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి కల్యాణ మండపంలోని వేదికపైకి వేంచేపు చేశారు. 4-30 నుంచి 6-30 వరకు అశేష భక్తుల గోవింద నామస్మరణల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. రాత్రి 7 గంటలకు శ్రీవారు వాహన మండపంలోకి వేంచేపు చేశారు. రాత్రి ఎనిమిది గంటలకు సర్వభూపాల వాహన సేవ ప్రారంభమైంది. సర్వాలంకార భూషితుడైన శ్రీవారు శ్రీదేవి, భూదేవి సమేతంగా సర్వభూపాల వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించారు. వాహన సేవ ఆలయానికి చేరుకున్న అనంతరం ఏకాంత సేవ నిర్వహించారు. ఏఈఓ రమేష్, ఆలయ సూపరిండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తదితరులు పర్యవేక్షించారు.

నేడు గరుడసేవ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 8 గంటలకు పల్లకిలో మోహినీ ఉత్సవం, సాయంత్రం 5-30 నుంచి 6-30 వరకు ఊంజల్ సేవ ఉంటుంది. రాత్రి 7-30 నుంచి 9 వరకు గరుడ వాహనంపై స్వామి వారు విహరిస్తారు.



సర్వభూపాల వాహనంపై శ్రీవేంకటేశ్వరుడి కటాక్షం

ప్రభుత్వ బడిని రక్షించుకుందాం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీఈఓ దేవరాజు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ బడిని రక్షించుకుందాం.. ప్రభుత్వ బడుల్లో విద్యార్థులను చేర్పిద్దాం అని డీఈఓ దేవరాజు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పీసీఆర్ ప్రభుత్వ పాఠశాలలో యూటీఎఫ్ నాయకులు ముద్రించిన ప్రభుత్వ బడిని రక్షించుకుందాం కరపత్రాలను డీఈఓ ఆవిష్కరించారు. డీఈఓ మాట్లాడుతూ బడి అంటే ఉపాధ్యాయుడు, విద్యార్థి మాత్రమే కాదని అన్నారు. చుట్టూ ఉన్న సమాజం, అమ్మ ప్రేమ, నాన్న భరోసా కలగలసిన ఆట పాటల స్వేచ్ఛా చదువులు ప్రభుత్వ బడి అని అన్నారు. చదువు, సంస్కారం, నైతిక విలువలు, దేశభక్తి, సమానత్వం ఏర్పడేది ప్రభుత్వ బడిలోనే అని చెప్పారు. ప్రభుత్వ బడుల బలోపేతం కోసం ప్రతి ఉపాధ్యాయుడు శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ మాట్లాడుతూ ప్రభుత్వ బడుల గొప్పదనాన్ని తెలియజేసేందుకు కరపత్రాలను ముద్రించినట్లు తెలిపారు. కరపత్రాలతో క్షేత్రస్థాయిలో విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్‌నాయుడు, మణిగండన్, నాయకులు రహనబేగం, రెడ్డెప్ప, ఎస్.పీ భాషా, సరిత, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పురస్కారాలకు దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా అర్హత, ఆసక్తి ఉన్న బాలలు జాతీయ పురస్కారాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఐసీడీఎస్ పీడీ నాగశైలజ తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో వివిధ రంగాల్లో ప్రతిభ ఉన్న 5 నుంచి 18 సంవత్సరాలలోపు బాలలు పురస్కారాలకు దరఖాస్తుకు అర్హులని పేర్కొన్నారు. సామాజిక సేవ, సాంకేతిక పరిజ్ఞానం, పర్యావరణం, విద్య, ధైర్య సాహసాలు, క్రీడలు, కళలు, సాహిత్యం, సంస్కృతి, సంగీతం, నృత్యం, పెయింటింగ్, నూతన ఆవిష్కరణలు, నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు వంటి అంశాల్లో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారు అర్హులన్నారు. అర్హత ఉన్న వారు జూలై 31 వ తేదీలోపు www.awards.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఎంపికయ్యే బాలలకు రాష్ట్రపతి చేతుల మీదుగా వచ్చే ఏడాది బహుమతితో పాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రాలు అందజేస్తారని పీడీ వెల్లడించారు.

మరింత మెరుగైన సేవలు అందించాలి



రెవెన్యూ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న డీఆర్‌ఓ పుల్లయ్య, సిబ్బంది

చిత్తూరు కలెక్టరేట్ : రెవెన్యూశాఖాధికారులు ప్రజలకు మరింత చేరువై మెరుగైన సేవలు అందించాలని డీఆర్‌ఓ పుల్లయ్య అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాల్గొన్న డీఆర్‌ఓ మాట్లాడుతూ రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ భూ వ్యవహారాలు, ధ్రువీకరణపత్రాల మంజూరు తదితర సేవలు అందిస్తున్నారన్నారు. దేశానికి స్వాతంత్ర్యం రాక ముందు ఈస్ట్ ఇండియా పాలకులు 1786 జూన్ 20న రెవెన్యూ బోర్డు ఏర్పాటు చేశారన్నారు. దీంతో ఏటా అదే తేదీన రెవెన్యూ దినోత్సవం జరుపుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రతి విద్యార్థికీ పాఠ్య పుస్తకాలు అందాలి

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పకడ్బందీగా పంపిణీ చేయాలని డీవైఈఓ చంద్రశేఖర్ అన్నారు. గురువారం నగరంలోని డీఈఓ కార్యాలయం పక్కనున్న ప్రభుత్వ పాఠశాలలో పాఠ్యపుస్తకాల పంపిణీని ప్రారంభించారు. పాల్గొన్న డీవైఈఓ మాట్లాడుతూ ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్య పుస్తకాలు ప్రతి విద్యార్థికి అందాలని తెలిపారు. ఎక్కడైనా అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం హసన్‌భాషా, టీచర్లు, పాల్గొన్నారు.


శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ ఏటీజీహెచ్ వద్దకు చేరింది. బుధవారం అర్ధరాత్రి వరకు 79,584 మంది స్వామివారిని దర్శించుకోగా 31,848 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.5.41 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

అటవీ ప్రాంతాల్లో విస్తారంగా వ్యాపించిన చిట్టి వెదుర్ల అనధికార రవాణా అక్రమార్కులకు సిరులు కురిపిస్తోంది. పెద్దపంజాణి, సోమల మండలాల సరిహద్దు ప్రాంతంలోని పుంగనూరు ఫారెస్టు రేంజ్‌కు చెందిన పేటూరు బీట్‌లో చిట్టి వెదురు విస్తారంగా ఉంది. సమీప గ్రామాల నుంచి అటవీ మార్గాల గుండా ఉన్న దారుల్లో వెదుర్లు తరలించే ట్రాకర్లు నిత్యం దర్శనమిస్తుంటాయి. కట్టడి చేసేవారు లేకపోవడంతో ఈ వెదుర్ల వ్యాపారం అక్రమార్కులకు ప్రధాన ఆదాయ వనరుగా మారింది.

రిజర్వు ఫారెస్టులో వెదుర్ల వేట

- చిట్టి వెదురుకు పెరిగిన డిమాండు
- సిరులు కురిపిస్తున్న అక్రమ వ్యాపారం



పేటూరు బీట్‌లో తరలించేందుకు సిద్ధం చేసిన చిట్టి వెదురు కర్రలు(ఫైల్)


టమాట పంటలో టేకింగ్ కోసం పాతిన కర్రలు

పెద్దపంజాణి: టమాట, బీన్స్ పంటలో టేకింగ్ కోసం 5,6 అడుగుల పొడవు ఉన్న కొయ్యలకు డిమాండ్ ఉంది. పస్తుతం టమాట సాగు ఊపందుకోవడంతో పలువురు రైతులు వాటికి ఊతాన్నిచ్చే కర్రలను భారీ ఎత్తున కొనుగోలు చేస్తుండడంతో చిట్టి వెదురు, యూకలిప్టస్ కొయ్యలకు విపరీతమైన డిమాండు వచ్చింది. అటవీ ప్రాంతం నుంచి అక్రమార్కులు తీసుకొచ్చిన చిట్టి వెదురు ఒక కర్రను దాదాపు రూ 30, యూకలిప్టస్ కర్రను రూ. 22 చొప్పున రైతులు కొనుగోలు చేస్తున్నారు. ఎకరం టమాట సాగుకు సుమారు 1000 నుంచి 2000 కర్రల దాకా అవసరం ఉంటోంది. దీంతో కర్రలు కొనేందుకు రైతులు వివిధ మార్గాల ద్వారా అన్వేషిస్తున్నారు. అటవీ ప్రాంతాల్లో దొరికే చిట్టి వెదురు కర్రలు మన్నికగా ఉండడంతో పాటు ఐదారు పంటల వరకూ చెదలు పట్టకుండా ఉంటాయని రైతులు వాటి కొనుగోలు చేసేందుకు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు.

లోపించిన నిఘా..

అటవీ ప్రాంతాల నుంచి అక్రమంగా వెదురు తరలిపోతున్నా అటవీ శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు. విలువైన కలపను కొట్టి అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నా వారు దృష్టి సారించడం లేదనే విమర్శలొస్తున్నాయి. ఫలితంగా అక్రమార్కులు పెద్ద ఎత్తున అటవీ సంపదను కొల్లగొడుతున్నారు.

మూడు పువ్వులు ఆరు కాయలుగా అక్రమ వ్యాపారం

రైతుల అవసరాలకు సరిపడే యూకలిప్టస్ కర్రలు అందుబాటులో లేకపోవడంతో నాణ్యమైన టేకింగ్ కర్రల కోసం పలువురు రైతులు చిట్టి వెదురు కర్రలను కొనుగోలు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. చిట్టి వెదురు బలంగా ఉండడంతో రైతులు టమాట, బీన్స్ తోటలకు ఎక్కువగా వీటిని ఉపయోగిస్తుంటారు. దీంతో రైతులు వాటి కొనుగోలుకు అక్రమ మార్గాల ద్వారా వెదురు కర్రలను సేకరించే వారిపై ఆధారపడుతున్నారు. దీనిని అవకాశంగా చేసుకున్న అక్రమార్కులు అటవీ ప్రాంతంలోని చిట్టి వెదురును ఇష్టారాజ్యంగా కొట్టి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఒక వెదురు పొద నుంచి సుమారు వంద నుంచి రెండు వందల దాకా కర్రలు లభిస్తాయి. ఒక్కో కర్ర కొట్టేందుకు కూలీల ఖర్చు పది నుంచి పదిహేను రూపాయల వరకూ వెచ్చిస్తున్నారు. అనంతరం వాటిని రాచ మార్గాల గుండానే అటవీ ప్రాంతం నుంచి తరలించి పుంగనూరు, చౌడేపల్లె తదితర ప్రాంతాల రైతులకు రూ.30 నుంచి రూ.35 వరకు అమ్ముతున్నారు. ఫలితంగా అటవీ ప్రాంతంలోని వెదురు మాయమవుతోంది. వెదురును ఇష్టంగా ఆరగించే ఏనుగులు వాటికి ఆహారం లేకపోవడంతో పంటపొలాలపై దాడులు చేస్తున్నాయి.

చర్యలు తీసుకుంటాం

రిజర్వు ఫారెస్టు నుంచి తరలుతున్న చిట్టి వెదురు అక్రమ రవాణా గురించి తెలిసింది. ఇకపై అక్రమ రవాణా జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటాం. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్లను అప్రమత్తం చేస్తాం. అడవిలోకి వెళ్లే దారులన్నింటా గోతులు తీయించి వాహనాలు, కూలీలు వెళ్లకుండా పటిష్ట చర్యలు తీసుకుంటాం. – బాలకృష్ణారెడ్డి, ఇన్‌చార్జి ఎఫ్ఆర్వో(పుంగనూరు)

ఉచితంగా మట్టి నమూనా పరీక్షలు

- ఎస్సీ, ఎస్టీ రైతులు సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్‌రెడ్డి


సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్‌రెడ్డి

చౌడేపల్లె: టమాటా సాగు చేపట్టే ఎస్సీ, ఎస్టీ రైతులకు ఉచితంగా మట్టి నమూనా పరీక్షలు చేయించి పోషకాహార లోపాలను గుర్తించి తగిన సూచనలు ఇస్తామని జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్ రెడ్డి సూచించారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో డిజిటల్ గ్రీన్ ట్రస్ట్ సహకారంతో పుంగనూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల రైతు భరోసా కేంద్రాల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మిగిలిన రైతులు మట్టి నమూనా పరీక్షలు చేయించుకోవాలంటే ఒక సారికి రూ.20 చొప్పున చెల్లించాలని కోరారు. రైతులకు టమాట పంటకు కావాల్సిన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఐవీఆర్ఎస్ సిస్టం ద్వారా సమకూర్చేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. పంట సాగు మొదలైనప్పటి నుంచి పంట పూర్తయ్యే వరకు తీసుకోవాల్సిన మెలకువలపై అవగాహన కల్పించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో జిల్లా ప్రోగ్రాం మేనేజరు యశోద, హెచ్ఓ సంతోషి కుమారి తదితరులు ఉన్నారు.

మద్యం మత్తులో కానిస్టేబుల్‌పై దాడి

తిరుపతి క్రైమ్: మద్యం మత్తులో ఓ వ్యక్తి బుధవారం రాత్రి కానిస్టేబుల్ పై దాడి చేసిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. బస్టాండ్ సమీపంలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ విద్యాసాగర్ తాగిన వారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తుండగా ఓ వ్యక్తి అమాంతంగా మీదపడి దాడికి పాల్పడ్డాడు. అంతటితో ఆగకుండా కానిస్టేబుల్ చేతిని గాయపరిచి పారిపోయాడు. ఆ వ్యక్తి తిరుపతిలో నివాసం ఉంటున్న సుబ్బరాజులుగా గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

26న సామూహిక అక్షరాభ్యాసం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద ఈ నెల 26వ తేదీ బుధవారం హిందు ధర్మ పరిరక్షణ ట్రస్టు, దేవదాయశాఖ ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం ఉంటుందని ఈఓ ఎస్వీ నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9.30 గంటలకు చిన్నారులను వారి తల్లిదండ్రులు తీసుకొచ్చి అక్షరాభ్యాసంలో పాల్గొనాలని కోరారు.

ఉద్యోగాల కల్పనకు ప్రత్యేక శిక్షణ


లోకనాథం, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి

తిరుపతి అర్బన్: పీఎం కౌశల్ వికాస యోజన పథకంలో భాగంగా నిరుద్యోగ యువతకు స్థానిక పరిశ్రమల్లో ఉద్యోగాలు కల్పించడానికి ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆర్.లోకనాథం తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ వారి సౌజన్యంతో నిరుద్యోగ యువతకు ఆయా రంగాలలో శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పించడానికి ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక స్కిల్ హబ్ కేంద్రాన్ని గతంలోనే ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. అందులో భాగంగా తిరుపతి జిల్లాలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్‌లో స్కిల్‌హబ్‌ను ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ శిక్షణ సంస్థలో యువతకు అధునాతన శిక్షణతో పాటు ఉపాధి కల్పించనున్నట్టు పేర్కొన్నారు. పదో తరగతిపైన చదువుకున్న నిరుద్యోగుల్లో ఆసక్తి ఉన్న అందరికీ శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈనెల 24వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని, అదనపు సమాచారం కోసం 9700413939, 9866241270, 9676474274, 9703437472, 7981155147 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఆసనం..ఆరోగ్యం

ప్రస్తుత యాంత్రిక యుగంలో నిద్ర లేచింది మొదలు పడుకునే వరకు విశ్రాంతి లేని పయనం సాగుతోంది. ఈ క్రమంలో ఎన్నో శారీరక, మానసిక, సామాజిక అనారోగ్య రుగ్మతలు. వీటన్నింటి నుంచి ఉపశమనం కలిగించే దివ్య ఔషధమే యోగా. ఒత్తిడిని అధిగమించడానికి, శారీరక ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కోసం ప్రపంచం మొత్తం యోగాను జీవన విధానంలో భాగంగా చేసుకుటోంది. నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

- ఏకాగ్రత, దృఢచిత్తానికి తరుణోపాయం
- ఆరోగ్య సమస్యలకు పరిష్కారం
- నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం


చిత్తూరులో యోగా చేస్తున్న చిన్నారులు, పెద్దలు

చిత్తూరు కలెక్టరేట్ : మారుతున్న కాలంలో ప్రతి ఒక్కరూ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య ఒత్తిడి. అత్యంత ప్రమాదకరంగా పరిణమిస్తున్న ఈ రుగ్మతను తగ్గించేందుకు 'యోగా' ముఖ్యమైన ఔషధంగా మారింది. యోగాను ప్రపంచానికి పరిచయం చేసింది భారతదేశం. భారతీయ తత్వశాస్త్రాల షట్ దర్శనాల్లో న్యాయం, వైశేషికం, వేదాంతం, మీమాంస, సాంఖ్యం తర్వాత యోగం ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది. మనసుపై, శరీరంపై పట్టు సాధించడమే యోగాభ్యాసం అంతిమ లక్ష్యమని సాధకులు అంటుంటారు. దేహం, మనసు, భావోద్వేగాలను సమతుల్యం చేయడమే యోగమని విశ్లేషిస్తున్నారు. ఒత్తిడిని తగ్గించి ఆనందకర జీవనానికి తోడ్పడే సనాతన భారతీయ జీవన విధానంలో భాగమైన యోగ విశిష్టతను తెలియజేసేందుకు 2015 నుంచి ప్రతి ఏటా జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు.

ప్రతి ఆసనం ఉప'యోగ'మే

యోగాభ్యాసం సకల సమస్యలకు పరిష్కారం చూపుతుందని అందరూ విశ్వసిస్తున్నారు. అయితే యోగాభ్యాసంలో భాగంగా సాగే ఒక్కో ఆసనం ద్వారా ఒక్కో ఉపయోగం ఉంటుంది. పూర్ణ ధనురాస, చక్రాసన్ హలాసన్ జాను శీర్షాసన్ పశ్చిమోత్తాసన్ వక్షాసన్, శలాభసన్ వంటి వాటి వల్ల అభ్యాసకులు రోజంతా ఉత్సాహంగా గడుపుతుండడం గమనార్హం. బీపీ, షుగర్ సమస్యలకు నివారిణిగా ధ్యానం, యోగా పనిచేస్తుంది. ధ్యానంతో మనో వికాసం, ఆధ్యాత్మిక జ్ఞానం కలుగుతుంది. తలనొప్పి, వెన్నునొప్పి, మోకాళ్లనొప్పులు, అలసట లాంటి వాటిని దూరం చేసుకోవాలంటే యోగా తప్పనిసరి అని శాస్త్రీయంగా నిరూపితమైంది.

పెరిగిన ఆసక్తి..

గతంలో యోగాపై పెద్దగా ఎవరికీ ఆసక్తి ఉండేది కాదు. చాలా తక్కువ మంది మాత్రమే సాధన చేసే వారు. కానీ జూన్ 21 న యోగా దినోత్సవంగా ప్రకటించాక పలువురు యోగా శిక్షణ ఇవ్వడం మొదలు పెట్టారు. నిత్య సాధనతో కలిగే లాభాలపై అవగాహన పెరగడంతో అందరూ ముందుకొస్తున్నారు. జిల్లాలో యోగా అసోషియేషన్, సిద్ధ సమాధి యోగా ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. శుక్రవారం యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని అనేక విద్యాసంస్థల్లో, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, వివిధ అసోసియేషన్‌లు, కలెక్టర్ ఆధ్వర్యంలో అధికారికంగా యోగా దినోత్సవాన్ని నిర్వహించనున్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం....



యోగా వల్ల సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుంది. అందరూ ప్రతి రోజు కాస్త సమయం కేటాయించి యోగా సాధన చేస్తే మంచిది. ఇందుకోసం ప్రధానంగా ఆహార నియమాలు పాటించాల్సి ఉంటుంది. వయోభేదం లేకుండా ఎవరైనా సరే నిపుణుల పర్యవేక్షణలో యోగా సాధన చేస్తే మంచి ఫలితాలు ఉంటాయి.
– రెడ్డెప్పశెట్టి, యోగా శిక్షకుడు, చిత్తూరు

నిత్య సాధనతో మంచి ఫలితాలు



రోజూ యోగా చేయడం వల్ల ఆరోగ్యం మన సొంతం అవుతుంది. నేను రోజూ యోగా చేస్తాను. అలాగే సిద్ధ సమాధి యోగా ఆధ్వర్యంలో ఉచితంగా యోగా శిక్షణ ఇస్తుంటాను. చాలా మందికి యోగాను పరిచయం చేసి అవగాహన కల్పించాం. మా వద్ద యోగా చేసే వారిలో విద్యార్థులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వ్యాపారులు, యువకులు ఇలా అన్ని వర్గాల వారు ఆసక్తిగా హాజరై యోగా చేస్తున్నారు.
– నరేంద్ర, యోగా గురువు, చిత్తూరు

కలుషిత ఆహారంతో అస్వస్థత

- వందమందికి పైగా అస్వస్థత
- పాలసముద్రంలో ప్రత్యేక వైద్య శిబిరం


చికిత్స పొందుతున్న బాధితులు

పాలసముద్రం : మండల కేంద్రంలోని బీసీ కాలనీ గంగజాతరలో అంబలి తాగి, అన్నదానంలో మాంసాహారం తిన్న వందమందికి పైగా గురువారం వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. మండల వైద్యాధికారి మోహన్‌కృష్ణ తక్షణం స్పందించి ప్రత్యేక శిబిరం నిర్వహించారు. వివరాలు ఇలా.. పాలసముద్రం బీసీ కాలనీలో బుధవారం జాతర జరిగింది. గ్రామస్తులు అంబలి సమర్పించారు. దాన్ని ప్రసాదంగా గ్రామస్తులందరూ స్వీకరించారు. అదే సమయంలో అన్నదానంలో మాంసాహారం భుజించారు. రాత్రికి కొందరికి వాంతులు విరేచనాలు కాగా, గురువారం ఉదయానికి వందమందికి పైగా వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. సమాచారం అందిన వెంటనే మండల వైద్యాధికారి సిబ్బందితో రైతు భరోసా కేంద్ర భవనం, పీహెచ్‌సీలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య పరీక్షలు చేసి, చికిత్సలు అందించారు.

అధికారుల రాక

డీపీఓ లక్ష్మి, ఎపిడిమాలజిస్టు శ్రీవాణి, తహసీల్దార్ సుబ్బులక్ష్మి, ఎంపీడీఓ రామనాథరెడ్డి, డీటీ మధుబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సాగర్ గ్రామాన్ని సందర్శించారు. చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. వైద్యాధికారి మోహన్‌కృష్ణ మాట్లాడుతూ కలుషిత ఆహారం తీసుకోవడం కారణంగా ఫుడ్‌పాయిజన్ అయినట్లు భావిస్తున్నట్లు తెలిపారు. ఎవరికీ ఎలాంటి ప్రాణహాని లేదని, అందురూ కోలుకుంటున్నారని స్పష్టం చేశారు. తాగునీటి శాంపిల్స్ తీసి పరీక్షలకు పంపినట్లు పేర్కొన్నారు. మండల విస్తరణాధికారి రమేష్, పంచాయతీ కార్యదర్శులు ధరణి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రెండు దుకాణాల్లో చోరీ



చోరీ జరిగిన వాసవీ ట్రేడర్స్ దుకాణం

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లెలో బుధవారం రాత్రి రెండు దుకాణాల్లో చోరీ జరిగింది. మెయిన్‌రోడ్డులోని వాసవీ ట్రేడర్స్‌లో నగదుతో పాటు రూ.1.50 లక్షల విలువజేసే సిగరెట్ ప్యాకెట్లు, చెక్‌పోస్టు కూడలిలో కిట్టా ట్రేడర్స్‌లో రూ.లక్ష విలువజేసే సిగరెట్ ప్యాకెట్‌లను చోరీ చేశారు. బాధితులు గురువారం ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో కూడా సిగరెట్ ప్యాకెట్లు చోరీ అయినట్లు బాధితులు వాపోతున్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా ఫలితం లేకపోతుందని, సీసీ కెమెరాలకు అమర్చే డీవీఆర్‌లను సైతం దుండగులు చోరీ చేస్తున్నట్లు పేర్కొంటున్నారు.

తిరుపతిలో పీఎస్-4 హోటల్ సీజ్



తిరుపతి తుడా: తిరుపతిలోని లీలామహల్ సమీపంలో ఉన్న పీఎస్-4పై కార్పొరేషన్ అధికారులు కొరడా ఝళిపించారు. హోటల్ నిర్వాహకులకు రూ.50 వేల జరిమానా విధించడంతోపాటు హోటల్‌ను సీజ్ చేశారు. వివరాలు.. గురువారం మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో పీఎస్-4 హోటల్‌లో యాత్రికులు భోజనం చేస్తుండగా బీట్‌రూట్ కర్రీ వడ్డించారు. తింటుండగానే కర్రీలో విషపూరితమైన జెర్రీ కనిపించడంతో వెంటనే మున్సిపల్ కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు హోటల్‌కు చేరుకుని కిచెన్ పరిసరాలను, పరిశుభ్రతను, వంటకు వినియోగించే వస్తువులను పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు హోటల్‌ను సీజ్ చేశారు.



పీఎస్-4లో ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలిస్తున్న కార్పొరేషన్ అధికారులు


గురువారం పీఎస్-4లో వడ్డించిన ఆహార పదార్థాల్లో వచ్చిన జెర్రి